క్లుప్తంగా

దుకాణాల వేలంతో రూ.15.92 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద వివిధ దుకాణాలు నిర్వహించుకునేందుకు సోమవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ద్వారా రూ.15,92,300 ఆదాయం వచ్చినట్లు ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. ఏడాది పాటు మొత్తం 19 దుకాణాలు నిర్వహించుకునేందుకు వేలం నిర్వహించామన్నారు. గత ఏడాది దుకాణాల వేలం ద్వారా రూ.9,51,970 ఆదాయం రాగా ఈఏడాది అదనంగా రూ.6,40,330 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


పరిమి రవికుమార్(ఫైల్)

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పరిమి రవికుమార్ (60) నందిగామలోని స్వగృహంలో సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. రవికుమార్ గతంలో వీరులపాడు మండలం పొన్నవరం, మండలంలోని కీసర చర్చిగేట్ ఎంపీపీ స్కూల్‌లో పనిచేశాడు. గత నాలుగేళ్ల నుంచి గండేపల్లిలో స్కూల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన భార్య విజయకుమారి మండలంలోని పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు మేరుగ రవికుమార్, జెర్రిపోతుల జ్యోతి, మార్కపూడి గ్రేస్‌మణి, డీ కనకదుర్గ, కే పుల్లారావు, వీ రాంబాబు, టీజేఎస్ జయపాల్‌లు రవికుమార్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

నేడు ఆలయ పాలకవర్గ సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ చాంబర్‌లో జరుగుతుందని ఈఓ కిషోర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించటంతో పాటు తీర్మానాలు ఆమోదించాల్సి ఉందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నందిగామ టౌన్: మండలంలోని చెరువుకొమ్ముపాలెం, పెద్దవరం, కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు గ్రామాలలో సీసీ రోడ్లు, కాట్రేనిపల్లి– పెద్దవరం, బండిపాలెం– పెద్దవరం తారు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం క్రిక్స్ బయోటెక్స్ కంపెనీ సహకారంతో కొత్త బెల్లంకొండవారిపాలెం గ్రామంలో చేపట్టిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నేడు అవగాహన ర్యాలీలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఎంపీడీవో నితిన్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీలలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పథకంపై ప్రజలకు అవగాహన కలిగించేలా ర్యాలీలు చేయాలన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు



నందిగామ టౌన్: పట్టణంలోని త్యాగరాజ సేవా సమితి ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి వారి 16వ ఆరాధనా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక ముక్కోటి మండపంలో త్యాగరాజ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారిని ఉంచి డోలు, సన్నాయి, బ్యాండ్, తదితర మంగళవాయిద్యాల నడుమ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు షేక్ మస్తాన్ సాహెబ్, షేక్ అన్సార్ సాహెబ్, షేక్ జాన్ సాహెబ్, అన్నవరపు మురళీకృష్ణ, సీహెచ్ వెంకట ముని, గుంటుపల్లి హరి, భక్తులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా!

- సొసైటీల్లో రైతులకు సరిపడా అందని యూరియా
- అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేట్ వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు


పెనుగంచిప్రోలు పీఏసీఎస్‌లో యూరియా కోసం అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

పెనుగంచిప్రోలు: యూరియా కొరత రైతులను వేధిస్తోంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)ల వద్ద రైతులు యూరియా కట్టల కోసం పోటీ పడుతున్నారు.

పరిస్థితి ఇదీ..

ప్రస్తుత ఈరబీ సీజన్‌లో వరి, మొక్కజొన్నతో పాటు వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు సాగు చేస్తున్నారు. ఏ పంట సాగు చేయాలన్నా రైతులకు యూరియా అవసరం. అయితే రైతులకు తగినంతగా యూరియా సరఫరా లేక పోవటంతో ప్రైవేట్ వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

సహకార సంఘాల్లో బస్తా రూ.270

సహకార సంఘాల్లో యూరియా బస్తా రూ.270కి విక్రయిస్తుండగా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ వ్యాపారులు రూ.340 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అయితే అధికారులు ఇది నిజం కాదని బుకాయిస్తున్నారు.

ఇప్పటికి 150 టన్నులు..

ఇప్పటి వరకు గుమ్మడిదుర్రు సహకార సంఘంలో 50 టన్నులు, అనిగండ్లపాడు సహకార సంఘంలో 75 టన్నుల యూరియా రాగా సోమవారం పెనుగంచిప్రోలు సహకార సంఘానికి 25 టన్నుల యూరియా వచ్చింది. సంఘాల్లో ధర తక్కువగా ఉండటం, వరి, మొక్కజొన్న అధికంగా సాగు చేయటంతో రైతులు యూరియా లారీ వచ్చిన గంటల వ్యవధిలోనే కొనుగోలు చేసేస్తున్నారు.

ఆధార్ కార్డుకు రెండు బస్తాలు..

రైతుల డిమాండ్ అధికంగా ఉండటంతో సంఘాల్లో ఒక ఆధార్ కార్డుకు రెండు బస్తాల చొప్పున యూరియా అందిస్తున్నారు. అయితే ఇవి ఏమాత్రం చాలటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు యూరియా, ఎరువులు పుష్కలంగా అందించారని రైతులు అంటున్నారు. యూరియా విరివిగా దొరకక పోవటంతో రైతులు సరిహద్దులో ఉన్న తెలంగాణలోని మధిర, బోనకల్ పట్టణాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. తక్షణం యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కొరత రాకుండా చూడాలి



రైతులకు యూరియా కొరత లేకుండా సొసైటీల ద్వారా అందించాలి. రబీలో వరి, మొక్కజొన్న బాగా సాగు చేశారు. వరినాట్లు ఇంకా జరుగుతున్నాయి. యూరియా ఈ సమయంలో పైరుకు చాలా అవసరం. యూరియా లారీ వస్తే వెంటనే అయిపోతున్నాయి.

– గింజుపల్లి శ్రీనివాసరావు, రైతు, అనిగండ్లపాడు

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



సహకార సంఘాల ద్వారా రైతులకు యూరియా కట్టలు అందిస్తున్నాం. ఇప్పటివరకు మండలంలో దాదాపు 150 టన్నుల యూరియా వచ్చింది. ఇంకా వస్తుంది. ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయించటం లేదు. అలా చేస్తే చర్యలు తప్పవు. సంఘాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా బస్తాలు అందిస్తాం..

– కె.రామసుబ్బారెడ్డి, ఏఓ

కంపచెట్ల తొలగింపు


కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

పెనుగంచిప్రోలు: స్థానిక చెరువుకట్టపై ఉన్న కంపచెట్లు, ఇతర పిచ్చి మొక్కలను జేసీబీ సాయంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ చెరువుకట్ట సుందరీకరణ చర్యల్లో భాగంగా కంపచెట్లు తొలగిస్తున్నామన్నారు.

నందిగామ టౌన్: మండలంలోని కొణతమాత్మకూరు – తొర్రగుడిపాడు ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా కంప చెట్లు దట్టంగా పెరిగి దర్శమిస్తున్నాయి. కంప చెట్లతో రహదారి ప్రమాదకరంగా మారినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోకపోవటంతో గ్రామాల నాయకులు చెరుకూరు హైమారావు, మేడా రాధాకృష్ణ, మన్నేపల్లి వినయ్ సోమవారం సొంత ఖర్చుతో జేసీబీని ఏర్పాటు చేసి కంప చెట్లు తొలగించారు. కంప చెట్లు తొలగించటంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నక్కా కమల అన్నారు. సోమవారం గుమ్మడిదుర్రు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పి.అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తోందని, దానిలో భాగంగా పశువులకు చూడు పరీక్షలు, జీవాలు, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయటంతో పాటు ఇతర పశు వ్యాధులపై పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీభార్గవి

గౌరవరం(జగ్గయ్యపేట): విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని పిల్లల సంరక్షణ జిల్లా అధికారి రాజేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలు, బాలల చట్టాలపై సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగనవాడీ కార్యకర్తలు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గౌడ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

నందిగామ టౌన్: గౌడ కులానికి నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నందిగామ మండలానికి ఒక మద్యం దుకాణాన్ని కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ బంగార్రాజు సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జత చేయాలన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ.రెండు లక్షల నాన్ రిఫండబుల్ ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. దరఖాస్తులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి ఐదవ తేదీలోగా పంపించాలని కోరారు. ఏడున కలెక్టర్ పర్యవేక్షణలో కేటాయింపులు జరుగుతాయని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మూడు మద్యం దుకాణాల కేటాయింపు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కార్మికులకు ప్రభుత్వం మూడు మద్యం దుకాణాలను కేటాయించిందని సీఐ గురవయ్య తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణం, జగ్గయ్యపేట మండలం, వత్సవాయి మండలంలో ఒక్కో దుకాణాన్ని కేటాయిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దరఖాస్తుదారులు రూ.రెండు లక్షల దరావత్తు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు జత చేయాలన్నారు. ఈ నెల ఫిబ్రవరి ఐదవ తేదీలోగా దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా జాతీయ ఎలక్ట్రిషియన్ డే


ఎలక్ట్రిషియన్ డే వేడుకల్లో యూనియన్ నేతలు, సభ్యులు

కంచికచర్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నేషనల్ ఎలక్ట్రిషియన్ డే వేడుకలు ప్రైవేటు ఎలక్ట్రిషియన్లు సోమవారం జరుపుకున్నారు. ఇటీవల కంచికచర్ల, వీరులపాడు మండలాల ప్రైవేటు ఎలక్ట్రిషియన్ల యూనియన్ ఎన్నికలు జరిగాయి. యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వీరులపాడు మండలం గోకరాజుపల్లి గ్రామానికి చెందిన పంచుమర్తి కోటేశ్వరరావు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా జెండా ఎగురవేశారు. మండలంలోని కీసర మామిడితోటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రిషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రైవేటు ఎలక్ట్రిషియన్లను ప్రభుత్వం గుర్తించి, రాయితీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల స్థలం, ఇళ్లు కూడా మంజూరు చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా వీ వెంకటరత్నం, గౌరవ సలహాదారుగా పీ వీరబాబు, ఉపాధ్యక్షులుగా ఎస్‌డీ నాగుల్‌మీరా, ఎస్.రమేష్, కోశాధికారిగా వై.మల్లేశ్వరరావు, కార్యదర్శిగా మోగులూరు రాజారత్నం సహాయ కార్యదర్శి చిన్నపరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అతి త్వరలో టిడ్కో ఇళ్లను పూర్తిచేస్తాం

ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో టిడ్కో గృహ సముదాయాన్ని పూర్తిచేసి అతి త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. టిడ్కో ఇళ్లను మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడ్కో లబ్ధిదారులు బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.145 కోట్లను ప్రభుత్వమే భరించాలని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి మొదటి దశ టిడ్కో ఇళ్లను పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉదయభాను మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను 2017లో ప్రారంభించారని, 2019– 24 వరకు నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నానని, టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందజేసేందుకు కృషిచేశానన్నారు. టిడ్కో పీడీ చిన్నోడు, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం

వీరులపాడు: మండలంలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఇరిగేషన్ కార్పొరేషన్ ఏఈ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో దేవినేని వెంకట రమణ 1, 2 ఎత్తిపోతల పథకాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పథకాల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుందన్నారు. పథకాన్ని నిర్మించి రెండున్నర దశాబ్దాలవుతుందని, ప్రస్తుతం పైపులైన్, మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. మరమ్మతుల అంచనాల నివేదికను ఉన్నతాధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం చైర్మన్ బంకా రాజేశ్వరరావు, రైతులు బంకా చంటి, గురునాథం, బాబూరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన మందా వజ్రమ్మ (50) సోమవారం హైబీపీ రావటంతో మృతి చెందారు. ఈమె బతికి ఉన్న సమయంలో తన కళ్లను ఇతరులకు దానం చేస్తామని కుటుంబ సభ్యులతో అన్నారని తెలిసింది. ఆమె కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది కార్నియాలను సేకరించారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, వైఎస్సార్ సీపీ నాయకులు యద్దనపూడి విజయారావు పలువురు వజ్రమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పెరటి తోటల పరిశీలన


పెరటి తోటలు పరిశీలిస్తున్న సీడీపీఓ లక్ష్మీభార్గవి

పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాలోల పెరటి తోటల పెంపకం వలన చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులకు బలమైన ఆహారం అందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ పి. లక్ష్మీభార్గవి అన్నారు. సోమవారం గ్రామంలోని 6,12 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల ఆవరణలోని పెరటో తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు వాడకండా ఆకుకూరలు, కాయగూరలు పండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రీస్కూల్ పిల్లలను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


మిర్చి పంటను పరిశీలిస్తున్న నాయకులు

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): తెగుళ్లతో పంట నష్టపోయిన మిర్చి రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కౌలు రైతు సంఘ నాయకులు కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వేరుకుళ్లు తెగులుతో నష్టపోయిన మిర్చి పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ఎన్నికల హామీలను కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. రైతు సంక్షేమానికి కనీస కార్యక్రమాలు కూడా చేపట్టటం లేదని ఉద్యాన శాఖాధికారులు కూడా స్పందించటం లేదన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, షేర్‌మహ్మద్‌పేట గ్రామాలలో కూడా వందల ఎకరాలలో మిర్చి రైతులు నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా ఆదుకోవాలని లేకుంటే రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోట కృష్ణ, రైతులు ఆరేగడ్డ వెంకయ్య, హనుమంతరావు, వినోద్, నాగరాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలం

సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీ కృష్ణ


మాట్లాడుతున్న డీవీ కృష్ణ

నందిగామ టౌన్: సూపర్ సిక్స్ హామీలను అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీ కృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలవుతున్నా కనీసం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేకపోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యానికి రూ.2200 మద్దతు ధర అందిస్తే ప్రస్తుత ప్రభుత్వంలో రూ.1700 మించి కొనుగోలు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి, మిర్చి పంటలకు కూడా గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారని మండిపడ్డారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు విడుదల చేయకపోవటంతో విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని, కొందరైతే విద్యార్థులు పరీక్షలు రాసేందుకు కూడా ఒప్పుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకం రాకపోవటంతో రైతులు పెట్టుబడి ఖర్చులకు అవస్థలు పడుతున్నారని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కటారపు గోపాల్, సయ్యద్ ఖాశీం, రవిశేఖర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై అక్రమ కేసును ఎత్తేయాలి


న్యాయస్థాన ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామ టౌన్: న్యాయవాదులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు బాబు విద్యాసాగర్ పేర్కొన్నారు. జగ్గయ్యపేట న్యాయవాది బెజవాడ భిక్షయ్యపై వత్సవాయి పోలీసులు అక్రమ కేసు బనాయించటాన్ని నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం కోర్టు విధులు బహిష్కరించారు. కోర్టు సముదాయం ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిక్షయ్యపై బనాయించిన అక్రమ కేసును తక్షణమే ఎత్తేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మన్నెం నారాయణరావు, బొందలపాటి రామకృష్ణ, నండ్రు శ్రీరామ్మూర్తి, రామారావు, భాస్కరరావు, వెంకటరత్నం, ఆనంద్ విజయ్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: తమ న్యాయవాదిపై పెట్టిన కేసును ఎత్తివేయాలని కోరుతూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ న్యాయవాదిపై తప్పుడు కేసులు పెట్టిన వారికి వత్తాసు పలుకుతూ న్యాయవాది ప్రమేయం లేకున్నప్పటికీ ఏ–1 నిందితుడిగా చేర్చి పిటిషన్ ఇచ్చిన గంటలోనే కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. న్యాయవాదిపై కేసును ఎత్తివేసే వరకు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వత్సవాయి ఎస్‌ఐ పెట్టిన కేసును తొలగించాలని కోరారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వెంకట్రామయ్య, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, గోనెల వెంకటేశ్వర్లు, దామాల సంతోష్, ప్రపుల్ల శ్రీకాంత్, ధనుంజయుడు, అన్నెపాగ కాంతారావు, ఆంజనేయులు, కృష్ణయ్య, కరిసె రత్నబాబు, గంటా కృష్ణంరాజు, డీవీ.కృష్ణ, జగ్జీవన్ రామ్, అశోక్, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్, నరేష్, శ్రీధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఉత్తమ సేవలకు అవార్డులు



కలెక్టర్ లక్ష్మీశ నుంచి ఉత్తమ అధికారులుగా అవార్డు అందుకుంటున్న కార్యదర్శి మాదా సాయిరాం, తహసీల్దార్ హుస్సేన్, కమిషనర్ రమణబాబు

నందిగామటౌన్: పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజాసమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ ఉత్తమ ప్రతిభను కనబరిచిన నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఉత్తమ కమిషనర్‌గా అవార్డు అందుకున్నారు. విజయవాడలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న కమిషనర్‌ను కార్యాలయ సిబ్బంది, పలువురు రాజకీయ ప్రముఖులు అభినందించారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల కార్యదర్శి మాదా సాయిరాం ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: విధి నిర్వహణలో ప్రతిభకనబరిచిన వీరులపాడు తహసీల్దార్ హుస్సేన్ ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్నారు. కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ ఆయనకు అవార్డును అందజేసి అభినందించారు. ఉత్తమ ఆర్‌ఐగా సంధ్య అవార్డును అందుకున్నారు. ఉత్తమసేవా అవార్డులు అందుకున్న తహసీల్దార్ హుస్సేన్, ఆర్‌ఐ సంధ్యను డీటీ నాగరాజు, వీఆర్వోలు అభినందించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాట్రాయి: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ సోమవారం తెలిపారు. మండలంలోని కోటపాడుకి చెందిన బజ్జూరి శివ, బూరుగుగూడెంకు చెందిన సుబ్బలక్ష్మి (32)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 22న సుబ్బలక్ష్మికి ఆమె భర్త శివ మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగు మందును సుబ్బలక్ష్మి తాగింది. చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 26న మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.